మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK
M.Sc B.Ed
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp :9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనంకోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
ఆదివారం | 22 మార్చి 2026 | పేజీలు : 12


3వ పేజీలో

## నీటిని ఆదా చేసి బాధ్యతాయుతంగా వినియోగించండి

జీవీఎంసీ కమిషనర్ పిలుపు


2వ పేజీలో

# ప్రత్యక్ష నారాయణుడి చెంత అభివృద్ధి వెలుగులు


3వ పేజీలో

## బలహీనతలను బలంగా మార్చుతూ గ్లోబల్ డెస్టినేషన్ గా ఉత్తరాంధ్ర

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


3వ పేజీలో

## నూకాంబికను దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి

కట్టుదిట్టమైన భద్రత, క్యూలైన్ల నిర్వహణకు ఆదేశం


2వ పేజీలో

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమీక్షా సమావేశం


3వ పేజీలో

## క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

- ఎన్.సి.సి.విద్యార్థులతో మమేకమైన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్


2వ పేజీలో

## "భక్తులకు మెరుగైన సౌకర్యాలే ప్రాధాన్యం..మెట్ల మార్గంపై ఈవో ఆకస్మిక తనిఖీ"

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఒకటి తరువాయి



**అనకాపల్లి (నక్కపల్లి) , మార్చి 21 ( మనం న్యూస్ ) :** నక్కపల్లి మండలం, చందనాడ రెవెన్యూ పరిధిలోని తమ్మయ్యపేట వద్ద ఈ నెల 23న (సోమవారం) జరగనున్న ప్రతిష్టాత్మక ఆర్సిలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ (AM/NS) ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుతో పాటు, కేంద్ర మంత్రులు హెచ్.డి. కుమారస్వామి, కింజరపు రామ్మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత మరియు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ , జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా , మరియు ఇతర ఉన్నతాధికారులు శనివారం క్షేత్రస్థాయిలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి గారి హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడి నుండి సభా ప్రాంగణం వరకు ఉన్న కాన్వాయ్ రూట్‌ను అధికారులు నిశితంగా పరిశీలించారు. ప్రతి శాఖకు కేటాయించిన విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా హెలిప్యాడ్ వద్ద మరియు సభా ప్రాంగణంలో పటిష్టమైన బందోబస్తు ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు సామాన్య ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం భద్రతలో ఎలాంటి రాజీ పడకూడదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత గారు అధికారులతో మాట్లాడుతూ.. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఈ స్టీల్ ప్లాంట్ కీలకమని, ఇంతటి భారీ కార్యక్రమానికి విచ్చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు మరియు అతిథులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రతా ప్రోటోకాల్స్‌ను పక్కాగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీ శౌర్యమాన్ పటేల్, అడిషనల్ డైరెక్టర్ శ్రీ ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు, ఎస్.ఎస్.ఓ శ్రీ ఆర్.పి.ఎల్.శాంతి కుమార్, అదనపు ఎస్పీలు శ్రీ ఎం.దేవ ప్రసాద్, శ్రీ ఎల్.మోహన రావు, ఆర్డీవో వీవీ రమణ, ఎస్.బి డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పి.శ్రీనివాసరావు మరియు ఇతర డీఎస్పీలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ప్రత్యక్ష నారాయణుడి చెంత అభివృద్ధి వెలుగులు

- కూటమి ప్రభుత్వంతోనే ఆధ్యాత్మిక వైభవం
- వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- అనుకున్న సమయం కన్నా పనులు ముందుగానే పూర్తి చేయాలి
- ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విస్తృత పర్యటన
- జిల్లాలో కేంద్రలో రు.12 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..ప్రారంభోత్సవాలు

ఒకటి తరువాయి



**అరసవల్లి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** ప్రసిద్ధ అరసవల్లి క్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం ప్రసాద్ ద్వారా రూ. 58 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

**భక్తుల సౌకర్యమే అతి ముఖ్యం అత్యుత్తమ వసతుల కల్పనధ్యేయంగా ప్రభుత్వం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పుష్కరిణి పనులకు రూ. 4 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా అత్యాధునిక వంటశాల, భోజనశాల, భక్తుల కోసం వసతి గృహాలు, విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కూటమి సర్కారు వచ్చాక రథ సప్తమి వేడుకలను రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకుని వచ్చామని, ఈ వేడుకలకు దక్కిన గుర్తింపు కారణంగా భక్త జనం ఎంతో ఆనందిస్తున్నారని, దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని అన్నారు. అనుకున్న సమయం కన్నా ఇంద్ర పుష్కరిణి పనులు ముందుగానే పూర్తి చేయాలి అని..భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**వీరుల సాహసానికి గుర్తు కార్గిల్ విక్టరీ**

నగరంలో ఏపీహెచ్బీ కాలనీలో కార్గిల్ విక్టరీ పార్కు ఆధునికీకరణ మరియు పునర్ నిర్మాణ పనులు పూర్తి అవ్వడం, వెనువెంటనే దీనిని అందుబాటులోకి తీసుకుని, నగర వాసులకు ఆహ్లాదకర వాతావరణం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రూ.2 కోట్ల వ్యయంతో సుడా ఆధ్వర్యంలో నిర్మించిన కార్గిల్ విక్టరీ పార్కును సద్వినియోగం చేసుకుని, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచే క్రమంలో అంతా సహకరించాలని కోరారు.

**బాబాయ్ - అబ్బాయ్ ఆటవిడుపు**

పార్కులోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, బాక్స్ క్రికెట్, పికిల్ బాల్ ఆడి బాబాయ్ - అబ్బాయ్ సందడి చేశారు. యుద్ధంలో గాయపడిన హవాల్దార్ చిన్ని సింహాచలం, హవాల్దార్ టొంప నీలాచలం సహా నాటి పోరులో పాల్గొన్న జిల్లాకు చెందిన 58 మంది యోధుల చరిత్రను నేటి తరం తెలుసుకునేలా పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషమని మంత్రులు కొనియాడారు. అనంతరం నాటి కార్గిల్ యుద్ధం పాల్గొన్న మన జిల్లా యుద్ధ వీరులను మంత్రులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ , కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ , అధికార మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నాయి.

**సెంట్రల్ లైటింగ్..డివైడర్..రోడ్లు ప్రారంభం**

నగర సుందరీకరణలో భాగంగా రామ లక్ష్మణ జంక్షన్ నుంచి పెద్దపాడు గ్రామం వరకూ ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ ను,డివైడర్ ను ప్రారంభించారు. అలానే పెద్దపాడు నుంచి రామ గెడ్డ వరకూ నిర్మించిన రోడ్డును.. ప్రారంభించారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తూ.. అలానే శివారు కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా పనులు అతి త్వరగా పూర్తిచేయడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

# "భక్తులకు మెరుగైన సౌకర్యాలే ప్రాధాన్యం..మెట్ల మార్గంపై ఈవో ఆకస్మిక తనిఖీ"

ఒకటి తరువాయి

**గోపాలపట్నం , మార్చి 21 ( మనం న్యూస్ ) :** శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని, శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి జె. వెంకట్రావు నేడు మెట్ల మార్గాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బందారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ తాతాజీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.కొండపై నుండి కాలినడకన మెట్ల మార్గం ద్వారా దిగువకు ప్రయాణిస్తూ, అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ తగిన విధంగా లేకపోవడంపై ఈవో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భక్తులకు కనీస సౌకర్యాల కల్పనలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని సిబ్బందిని హెచ్చరించారు.మెట్ల మార్గాన్ని ప్రతిరోజూ ఉదయం శుభ్రపరచి, పనుల అనంతరం ఫోటోలను పంపాలని శానిటరీ అధికారులకు ఆదేశించారు.కాలినడకన వచ్చే భక్తుల కోసం మెట్ల మార్గం మధ్యలో తక్షణమే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.మార్గమధ్యలో అవసరమైన ప్రదేశాల్లో మంచినీటి ట్యాప్ పాయింట్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే దేవస్థానం ప్రథమ కర్తవ్యమని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో స్పష్టం చేశారు.

# నీటిని ఆదా చేసి బాధ్యతాయుతంగా వినియోగించండి

**ఒకటి తరువాయి**

**విశాఖపట్నం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** వేసవి కాలంలో ప్రజలు నీటిని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే నగర పరిపాలనకు సహకరించాలని ప్రపంచ జల దినోత్సవం 2026 సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ వివరిస్తూ ప్రస్తుతం విశాఖపట్నం నగరానికి రోజుకు సుమారు 400 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఉండగా, 2047 నాటికి ఇది సుమారు 726 ఎం ఎల్ డి కు పెరుగుతుందని తెలిపారు.

విశాఖపట్నం వేగంగా పారిశ్రామిక మరియు ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో నీటి అవసరం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. నగరానికి దీర్ఘకాలిక నీటి భద్రతను కల్పించేందుకు జీవీఎంసీ కట్టుబడి ఉ ందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, సింగపూర్ వాటర్ సెంటర్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి అంతర్జాతీయ సంస్థల సాంకేతిక సహకారంతో సమగ్ర వాటర్ సెక్యూరిటీ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రస్తుత నీటి వనరులను శాస్త్రీయంగా అంచనా వేసి, భవిష్యత్తు అవసరాలను తీర్చడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఈ ప్రణాళికలో నీటి సంరక్షణ, వాడిన నీటి శుద్ధి ఉ పునర్వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, ఆధునిక సాంకేతికతల ద్వారా నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు మరియు నీటి పంపిణీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ "డ్రింక్ ఫ్రం ట్యాప్ " కార్యక్రమాన్ని అమలు చేస్తూ గృహాలకు 24 గంటల సురక్షిత తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటోందని, ఇది కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 మిషన్ కు అనుగుణంగా అమలవుతోందన్నారు.. ఈ కార్యక్రమంలో భాగంగా స్కడ సిస్టమ్స్ మరియు ఆటోమేటెడ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ద్వారా నీటి నాణ్యత మరియు సరఫరాను పర్యవేక్షిస్తున్నామన్నారు. నీటి నాణ్యతను నిర్ధారించేందుకు మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ ల ద్వారా నీటి నమూనాలను శుద్ధికి ముందు మరియు తర్వాత రియల్ టైమ్‌లో పరీక్షిస్తున్నామన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం మరియు అమృత్ 2.0 కింద 10 నీటి వనరుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి, ఇవి భూగర్భ జలాల నిల్వను పెంచడంతో పాటు నగర అందాన్ని మెరుగుపరుస్తాయన్నారు. ఈ సంవత్సరపు థీమ్ "నీరు మరియు లింగ సమానత్వం గా ఉ ండగా, గృహ స్థాయి నుండి నగర స్థాయి వరకు నీటి నిర్వహణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కమిషనర్ తెలిపారు

# క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

**ఒకటి తరువాయి**

**విజయనగరం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** ఇటీవల శివరాత్రి పర్వదినమున రామతీర్థం ఆలయంలో భక్తులను క్యూలైన్లలో పంపుటలో పోలీసుశాఖకు సహాయపడిన ఎన్.సి.సి. విద్యార్థులతో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మమేకమై, వారు పోలీసుశాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో మెలగాలని, తమ ఉన్నతమైన భవిష్యత్తుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ ద్వారా సమాజానికి సేవలందిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకొంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునన్నారు. ఎన్‌సీసీ క్యాంపుల్లో చురుకుగా పాల్గొని, ఇతర రాష్ట్రాల విద్యార్థులతో మమేకమవడం ద్వారా వారి ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనమని, దేశంలో ఎన్నో భిన్న మతాలు, కులాలు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులమనే భావనను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలో తాను కూడా ఎన్.సి.సి. విద్యార్థిగా క్యాంపులో చురుకుగా పాల్గొనే వాడినని గత స్మృతులను విద్యార్థులతో జిల్లా ఎస్పీ పంచుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామతీర్థం మరియు పుణ్యగిరి ఆలయాలలో భక్తుల క్యూలైన్ నిర్వహణలో ఎన్‌సీసీ విద్యార్థులు పోలీసు శాఖకు అందించిన సహకారాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. విద్యార్థుల సేవాభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరేందుకు ఇటువంటి ప్రశంసలు ఎంతగానో ఉ పయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, భోగాపురం రూరల్ సిఐ జీ.రామకృష్ణ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూకాంబికను దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి



**ఒకటి తరువాయి**

**అనకాపల్లి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలోని శ్రీ నూకాంబిక అమ్మవారిని శనివారం విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి, దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఐజీ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఐజీ ఆలయ పరిసరాలను పరిశీలించి స్థానిక పోలీస్ మరియు ఆలయ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాబోయే 90 రోజుల పాటు భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున, క్యూ-లైన్ల వద్ద ఎటువంటి తోపులాటలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం ఆలయ పరిసరాల్లోని సిసి కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, క్యూ-లైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది కలగకుండా చల్లని తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని మరియు నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను మరియు సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్ ఐజీ కి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకట్ నారాయణ, ఎస్సై సంతోష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బలహీనతలను బలంగా మార్చుతూ గ్లోబల్ డెస్టినేషన్ గా ఉత్తరాంధ్ర




**ఒకటి తరువాయి**

**విశాఖపట్నం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ తన బలాన్ని ప్రపంచానికి చూపిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నాడు విశాఖపట్నం నోవాటెల్ హోటల్ లో సి.ఐ.ఐ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థిరత్వం, పోటీతత్వం, భవిష్యత్ కు సిద్ధంగా ఆంధ్రపదేశ్ అనే అంశంపై జరిగిన కాన్ఫరెన్స్ లో తొలుతగా పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని సభకు తెలియపరిచారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఇటీవల పలు ప్రాంతాల్లో సీఐఐ సమ్మిట్ లలో వరుసగా భాగస్వామ్యం అవుతుండటం ఆనందంగా ఉ ందని అన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గురించి మాట్లాడే ముందు అందుకు నాయకత్వ బాధ్యత తీసుకున్న చంద్రబాబు నాయుడు విజన్ ను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

తొలిసారిగా 1995 లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న సమయం నాడే తన నాయకత్వాన్ని పరిచయం చేస్తూ దేశాన్ని అబ్బురపరిచారన్నారు. అప్పులతో విజన్ 2020 అంటే అపహాస్యం చేసిన వారు నేడు వాటి ఫలాలనుఅనుభవిస్తున్నారని, విజన్ 2020 సాధనకు గతంలో ప్రధానిగా వాజ్ పేయ్ నాయకత్వం కూడా తోడై స్పష్టమైన ఫలితాలు అందించిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన స్వర్ణాంధ్ర 2047 కు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడపరాదు

## - చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు : వాహనదారులకు ఎస్ఐ సురేష్ హెచ్చరిక

**గూడెంకొత్తవీధి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** మండలంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నట్లు ఎస్ఐ సురేష్ స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమిస్తూ వాహనాలు నడిపే వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ఆరు నెలలుగా మండల వ్యాప్తంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలు తరచుగా కనిపిస్తున్నాయని అన్నారు. ఇకపై ఇలాంటి చర్యలను ఏ మాత్రం ఉపేక్షించబోమని



స్పష్టం చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి వారిపై తక్షణవే చలానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అదేవిధంగా, మైనర్లకు వాహనాలు ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, అలాంటి సందర్భాల్లో వాహన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో తరచూ ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించిన ఎస్ఐ సురేష్, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్య కూడళ్ల వద్ద పోలీసులు పర్యవేక్షణ పెంచి, ఉల్లంఘనలు చేసే వారిని గుర్తించి తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, సురక్షిత ప్రయాణం కోసం ప్రతి వాహనదారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సరైన పత్రాలు వెంట ఉంచుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి ప్రాథమిక నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించబోమని స్పష్టం చేస్తూ, పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించుకోవాలని ఎస్ఐ సురేష్ పిలుపునిచ్చారు.

# విశ్వ కళ్యాణ భవన్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పాతపట్నం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండల కేంద్రంలో గల విశ్వ కళ్యాణ భవన్‌లో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో రాజయోగ సాధన, విశ్వ కళ్యాణ భావన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు సందేశం అందించారు. రాజయోగం ద్వారా మనసుకు ప్రశాంతత, జీవితంలో ఆనందం, ఆరోగ్యం సాధ్యమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించడానికి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కోసం రాజయోగం వంటి సాధనలను అవలంబించాలని సూచించారు. అదే విధంగా, విశ్వ కళ్యాణ భవన్ వార్షికోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ?20,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బ్రహ్మకుమారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పాల్తేరులో శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం

**పాయకరావుపేట , మార్చి 21 ( మనం న్యూస్ ) :** మండలం లోని పాల్తేరులో శ్రీరామ నవమి ఉత్సవాలకు శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవానికి అంకు రార్పణగా సంప్రదాయబద్ధంగా ముత్తైదువులు పెళ్లిరాట వేయడంతో ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పసుపు దంచి, సీతా రామ చంద్రుల సేవలో తరించారు. పాల్తేరు ముత్యాలమ్మ గుడి ఎదుట ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో ఈ నెల 27 వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ



మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్నసమారాధనతో పాటు పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు ఆలయ ధర్మకర్త, ప్రముఖ హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు-మాధవి దంపతుల ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యుల సహకారంతో కొనసాగుతున్నాయి. నవమి పర్వదినాన సాయంత్రం స్వామి, అమ్మవార్ల పల్లకి ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ డ్రమ్ములు, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త దేవవరపు రాంబాబు కోరారు.

# ఆర్డర్ చేస్తే నేరుగా ఇంటికే తాజా కూరగాయలు..!!

## - మార్కెట్ కు వెళ్లే పరిస్థితి లేదు, -ఏపీలో వినూత్న ప్రయోగం



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'డిజి రైతుబజార్' యాప్ ద్వారా తాజా కూరగాయలు, పండ్లు నేరుగా ఇంటికే చేరే డోర్ డెలివరీ సేవలను ప్రారంభించింది. ఏపీ మార్కెటింగ్ శాఖ, మాచిట్ సంస్థ సంయుక్తంగా ఈ వినూత్న సేవలను మొదట విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో అమలు చేస్తున్నారు. ఈ యాప్‌లో వినియోగదారులు తమకు అవసరమైన కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులను సులభంగా ఆర్డర్ చేసుకోవచ్చు. ఆర్డర్ చేసిన వెంటనే సమీప రైతుబజార్ నుంచి నాణ్యమైన ఉత్పత్తులను నేరుగా ఇంటి వద్దకే సరఫరా చేస్తారు. రైతులకు సరైన ధర లభించేలా, వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందేలా ఈ వ్యవస్థ రూపొందించినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ డిజిటల్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఈ సేవలు అమల్లోకి రావడంతో రైతులకు, వినియోగదారులకు సమానంగా లాభం చేకూరనుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# రంజాన్ వేడుకల్లో వంతాల నాగేశ్వరావు




**డుంబ్రిగుడ , మార్చి 21 ( మనం న్యూస్ ) :** మండలంలోని అరమ పంచాయతీ పరిడి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక మసీదులో శనివారం నిర్వహించిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ మాజీ కోశాధికారి వంతాల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయనతోపాటు స్థానిక మాజీ సర్పంచ్ సుబ్బారావు, కించుమండ మాజీ సర్పంచ్ బోయిన పొతి, మసీద్ గురువు నూర్ ఇస్లాం, అబ్రహం, వంతాల మొయిద్దీన్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ ఎస్ ఎస్ పథసంచలన కార్యక్రమం

**ఆనందపురం , మార్చి 21 ( మనం న్యూస్ ) :** రాష్ట్ర స్వయంసేవక్ సంఘం విశాఖ మహానగర్ ఆనందపురం ఖండం ఆధ్వర్యంలో పథసంచలన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. సమాజంలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ పంచముఖ స్వామి సన్నిధిలో ఉగాదికి స్వాగతం పలుకుతూ ఆనందపురం ఖండ గణవేషధారులైన స్వయంసేవకులతో పథసంచలనాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమం సమాజంలో ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గాయత్రి డిగ్రీ కళాశాల ప్రాంగణం వద్ద ప్రారంభమవుతుంది. ప్రధాన అతిథిగా కేశవయ్య హాజరై ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన స్వయంసేవకులు కార్యక్రమానికి పది నిమిషాల ముందుగానే రావాలని, గణవేషంలో హాజరవాలని నిర్వాహకులు కోరారు.

# నూకాలమ్మ హుండీకి రూ.12.70 లక్షల ఆదాయం



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** భీమిలిలో నిర్వహించిన శ్రీ నూకాలమ్మ ఉత్సవాలు ఘనంగా సాగగా, దేవాదాయ శాఖకు గణనీయమైన ఆదాయం సమకూరింది. ఉత్సవాల సందర్భంగా హుండీలు తెరిచి లెక్కించగా మొత్తం రూ. 12,70,682 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహణ అధికారి కీర్తి శ్రీనివాసరావు, కార్యనిర్వాహణ అధికారి టి. పద్మ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీ లెక్కింపును చేపట్టారు. టికెట్ల ద్వారా రూ. 7,18,895, హుండీ కానుకల ద్వారా రూ. 5,50,787 లభించగా, మొత్తం రూ. 12,70,682 ఆదాయం వచ్చినట్లు ఈ.ఓ. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మారోజు సత్య వరప్రసాద్, గంటా నూకరాజు, శిల్లా కరుణాకర్ రెడ్డి, గాడు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం వల్లే ఈ స్థాయిలో ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.

# పాతపట్నం మేజర్ పంచాయతీలో తాగునీటి అవస్థలు

**పాతపట్నం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** పాతపట్నం నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నం పట్టణ ప్రాంతంలో గత రెండు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడం తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అకస్మాత్తుగా కొళాయిలలో నీరు రావడం ఆగిపోవడంతో గృహ అవసరాలు తీర్చుకోవడంలో మహిళలు, వృద్ధులు నానా కష్టాలు పడుతున్నారు. ప్రధాన పైప్‌లైన్ మరమ్మత్తులకు గురవ్వడం వల్ల ఈ అంతరాయం ఏర్పడినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. అయితే అధికారుల జాప్యం కారణంగా ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు వెళ్లే వారు, రోజు వారి కూలీలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పంచాయితీ అధికారులు స్పందిస్తూ పైప్‌లైన్ మరమ్మత్తులు త్వరగా పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరి ంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కొంచెం సహనం పాటించాలని



వారు కోరారు. ప్రస్తుత పరిస్థితిని త్వరగా సరిచేయాలని, అవసరమైన చర్యలు తీసుకుని తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పలుదఫాలు పైప్ లైన్లు మరమత్తులకు గురి అవుతుండటం, వాటిని సంబంధిత అధికార యంత్రాంగం బాగుచేయడం పరిపాటి అయిపోందని, ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం వైపు అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# జి.మాడుగులలో ఘనంగా రంజాన్ వేడుకలు




**జి.మాడుగుల, మార్చి 21 ( మనం న్యూస్ ) :** పవిత్ర రంజాన్ పండుగను మండల కేంద్రంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక నమాజులు నిర్వహించి అల్లాహ్‌కు ప్రార్థనలు చేశారు. శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుతూ మసీదుల్లో ప్రార్థనలు కొనసాగాయి. పండుగ సందర్భంగా పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇళ్లలో ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి బంధుమిత్రులతో పంచుకున్నారు. చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఆనందంగా పండుగను జరుపుకున్నారు. మండలంలో రంజాన్ వేడుకలు శాంతి యుతంగా, ఆనందోత్సాహాలతో కొనసాగాయి.



# 23న భీమిలిలో ప్రపంచ కవితా దినోత్సవం

**భీమునిపట్నం,, మార్చి 21 ( మనం న్యూస్ ) :** ఈనెల 23 (సోమవారం) భీమిలి బస్సు స్టాండ్ సమీపంలోని అవంతి కార్యాలయం మేడ పైన ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కళా సాహితీ అధ్యక్షులు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ ప్రాంతాలకు చెందిన 15మంది కవులు తమ కవితలు వినిపిస్తారనీ, అనంతరం కవులకు సత్కారం ఉంటుందని చెప్పారు. ఈ కవి సమ్మేళనానికి సంధాన కర్త గా ప్రముఖ కవి బులుసు వెంకటేశ్వర్లు, ముఖ్య అతిధి గా ప్రవచన వాచస్పతి రామ కృష్ణనానంద వస్తున్నారని అన్నారు. కవుల సత్కారం డా. ఎన్.ఎల్.రావు, బి. చెన్నయ్య శెట్టి తదితర అతిదుల ద్వారా జరుగుతుందని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలతో కార్యక్రమం ముగుస్తుందని పి. ఆర్. పి. వర్మ తెలిపారు.

# రాజవొమ్మంగి నూతన ఎస్సై లతాశ్రీని కలిసిన ఎంపిపి జి వెంకటలక్ష్మి



**రాజవొమ్మంగి, మార్చ్ మన, మార్చి 21 ( మనం న్యూస్ ) :** రాజవొమ్మంగి మండలంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన మహిళా ఎస్సై లతాశ్రీ ను రాజవొమ్మంగి మండలం ఎంపిపి గోము వెంకటలక్ష్మి, నాయకులు వెంకటేష్ రాజు, కుశరాజు, వీర బాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఈక శ్రీనుబాబు లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, పోలీస్ శాఖతో సమన్వయం పెంపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

# నిరుద్యోగ లోకం గర్జిస్తోంది : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లా పాతపట్నం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, నిరుద్యోగుల జీవితాలతో చంద్రబాబు సర్కారు చెలగాటమాడు తోందని విమర్శించారు. ఉగాది నాడు ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులను నిలువునా వంచించేలా ఉంది. మంత్రి లోకేశ్ అద్భుతమైన క్యాలెండర్ ఇస్తామని చెప్పి, కేవలం తేదీలు మాత్రమే ఉండి ఉద్యోగాలు లేని క్యాలెండర్‌ను ప్రకటించి యువత ఆశలపై నీళ్లు చల్లారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 2019-24 మధ్య 6,31,310 ఉద్యోగాలను కల్పించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఒకే నోటిఫికేషన్‌తో 1.34 లక్షల సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ఆయనది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి,




అధికారంలోకి వచ్చాక ఉన్న 1.72 లక్షల మంది ఉద్యోగులను వలంటీర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఇప్పటికే రెండేళ్లు గడిచినా కేవలం 10,060 పోస్టులతో సరిపెట్టడం హాస్యాస్పదం. ఇది నిరుద్యోగులను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని బాండ్లు పంచిన చంద్రబాబు, గత 22 నెలలుగా ఆ ఊసే ఎత్తడం లేదు. తక్షణమే పాత బకాయిలతో కలిపి భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. పవన్, లోకేశ్‌లకు మంత్రి పదవులు వచ్చాయి కానీ, నిరుద్యోగులకు మాత్రం నిరాశే మిగిలిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు యువతకు ఆకాశమే హద్దుగా హామీలిచ్చి, వారి ఓట్లతో గద్దెనెక్కిన పవన్ కళ్యాణ్, నేడు అధికారం దక్కాక ఆ యువతను నట్టేట ముంచారు. యువతకు మంచి చేస్తాను, అన్ని విధాలా మేలు చేస్తాను, అండగా ఉంటాను అంటూ ఆర్భాటపు మాటలు చెప్పి యువతను నమ్మించిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు వారి సమస్యల గురించి మాట్లాడటం ఎందుకు మానేశారో సమాధానం చెప్పాలన్నారు. కేవలం ఓట్లు వేయించుకోవడానికే యువతను పావులుగా వాడుకున్నారని, పదవులు దక్కాక యువత భవిష్యత్తును గాలికొదిలేశారన్నారు.

# జాంకరవలసలో ఉపాధి హామీ పనులు కల్పించాలి

**-ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ**



**డుంబ్రిగుడ, మార్చి 21 ( మనం న్యూస్ ) :** జాంకరవలస గ్రామ గిరిజన ప్రజలకు వెంటనే మహాత్మ గాంధీ జాతీయ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కండ్రుం పంచాయతీ జాంకరవలస గ్రామంలో శనివారం ఆయన సందర్శించి అక్కడి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మూడో నెల దాటుతున్న నేటి వరకు ఉపాధి పనులు లేక సుదూర ప్రాంతాలు కాకినాడ, రాజమండ్రి, విజయవాడ వంటి పట్టణాలకు వలసలు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా నూతనంగా ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు ఒక రోజు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆందోళన నిర్వహి స్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రామచందర్, పరశురాం, గాసీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన మోప్మా పీడీ శైలజ



**నిమ్మాడ ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21:** పట్టణ పెదరికి నిర్మూలన సంస్థ (మోప్మా) పీడీ బొడ్డేపల్లి శైలజ నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ పేదరిక నిర్మూలన పేదల సంక్షేమం,మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన, యువతకు ఉపాధి అవకాశాల పెంపు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.మోప్మా ద్వారా అమలు అవుతున్న పథకాలు పట్టణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని శైలజ వివరించారు. అలాగే స్వయం సహాయక సంఘాల బలోపేతం, సూక్ష్మ వ్యాపారాల ప్రోత్సాహం,రుణ సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. మోప్మా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహాయం అందిస్తుందని, పట్టణ పేదరిక నిర్మూలనలో మరింత ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.పీడీగా ఆమె ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.

# ఘనంగా బోడ కొండమ్మ సాంబారి దేవి ఘటాల ఊరేగింపు



**గూడెంకొత్తవీధి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** మండలంలోని పూజారిపాకలు గ్రామంలో బోడ కొండమ్మ సాంబారి దేవి ఘటాల ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ బద్దంగా ఘటాలను అలంకరించి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లడం కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డప్పులు, మేళతాళాల మధ్య సాగిన ఈ ఊరేగింపు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. మహిళలు తలపై ఘటాలు ధరించి, భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక శోభను చేకూర్చింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని అమ్మవారిని ప్రార్థించగా, కొందరు ప్రత్యేక వ్రతాలు ఆచరించారు. ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించి, హారతులు ఇస్తూ భక్తి పరవశంలో మునిగిపోయారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి ఈ వేడుకను జరుపుకోవడం గ్రామ ఐక్యతను ప్రతిబింబించింది. కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.

ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పూజారిపాకలు గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని గ్రామస్తులు తెలిపారు.బోడ కొండమ్మ సాంబారి దేవి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని భక్తులు కోరుకున్నారు. ఈ వేడుక గ్రామ ప్రజల భక్తి, సంప్రదాయాల పట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటి చెప్పింది.

# మాడుగుల మండలంలో ధర్మ ప్రచారం : 2000 కుటుంబాల నుంచి 'ధర్మ నిధి' సేకరణ



**వి మాడుగుల , మార్చి 21 ( మనం న్యూస్ ) :** భారతీయ సనాతన ధర్మాన్ని రక్షించడమే లక్ష్యంగా సమరసత సేవ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు మాడుగుల మండల ప్రజలు భారీ మద్దతు ప్రకటించారు. మండలంలోని 2000 కుటుంబాల నుండి సేకరించిన 2 లక్షల రూపాయల ధర్మ నిధిని సంస్థ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ కు అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ, సమరసత సేవ ఫౌండేషన్ గత పదేళ్లుగా చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రతి పల్లెలో దేవాలయాన్ని కేంద్రంగా చేసుకుని హిందువులలో ధార్మిక అవగాహన కల్పిస్తున్నారు.మోసపూరిత మతమార్పిళ్లకు గురవుతున్న పల్లె ప్రజలకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణం చేపట్టారు. ఆయా వర్గాల వారికే అర్చక శిక్షణ ఇప్పించి, వారే స్వయంగా దేవాలయాలను నిర్వహించుకునేలా కమిటీలు ఏర్పాటు చేయడం అభినందనీయం. విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దేందుకు బాల వికాస్ కేంద్రాలను విజయవంతంగా నడుపుతున్నారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారకు తవ్వా సన్యాసిశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ గోశమాంబ వ్యవసాయ ఉత్పత్తుల సంఘం సీఈవో వడ్డీ రాజ్ కుమార్మండల గౌరవాధ్యక్షులుజల్దు సంజయ్ మండల కన్వీనర్ గౌరీపట్టపు మహేష్ కుమార్ మహిళా కన్వీనర్ చదలవాడ జయమ్మ, సభ్యులు: పుట్ట బలరాం, గొల్లవిల్లి సత్యారావు, సాధన శ్రీను పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చనున్న నక్కపల్లి స్టీల్ ప్లాంట్..!

**- అనకాపల్లి టిడిపి పరిశీలకులు గంటా నూకరాజు**



**భీమునిపట్నం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర పారిశ్రామిక రూపురేఖలు మారనున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. 2,200 ఎకరాల్లో 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ పరి శ్రమకు కూటమి సర్కార్ ప్రణాళి కలు రూపొందించిందని అన్నారు. ఈనెల 23వ తారీకు సోమవారం ఉదయం 10 గం. లకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి లో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో శంకుస్థాపన చేయుటకు అధికార యంత్రాంగం సంసిద్ధమైం దని అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ – నిప్పన్ సంస్థ మెగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకారం కుదిరిందని అన్నారు. శరవేగంగా పనులు పూర్తి చేసుకొని 2028 వ సంవత్సరం చివరికి మొదటి యూనిట్ ప్రారంభోత్సవ చేసే విధంగా రూపకల్పన జరుగుతుందని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా వేలాది మందికి స్థానిక ఉద్యోగాలు కల్పించడంతో పాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను భలోపేతం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసిన ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ బాబుకి, రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు హృదయ పూర్వక ధన్యవాదములు అని గంటా నూకరాజు అన్నారు.

# చింతపల్లి లో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) వేడుకలు

**చింతపల్లి, మార్చి 21 ( మనం న్యూస్ ):** ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గడచిన నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజ్‌లతో గడిపిన ముస్లింలు శుక్రవారం రాత్రి నెలవంక (చాంద్) దర్శనంతో ఉపవాసాలను ముగించి, శనివారం పండగ నమాజ్ ఆచరించారు. స్థానిక మజీద్-ఎ-క్యూబా మరియు మండలంలోని తాజంగి మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. చింతపల్లి మజీద్-ఎ-క్యూబా వద్ద మహిళలు కూడా పండగ నమాజ్ ఆచరించేందుకు ముస్లిం కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో నమాజ్‌లు ఆచరించారు. ఈ సందర్భంగా మజీద్ ఇమామ్ మొహమ్మద్ సాహిద్ మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం యొక్క విశిష్టతను వివరించారు. దానధర్మాలకు ప్రతీకగా భావించే ఈ మాసంలో ముస్లింలు సహరి, ఇఫ్తార్ విందులతో ఉపవాసాలను పాటించడం ఆనవాయితీ అని తెలిపారు. వాజిబ్



నమాజ్‌గా పిలువబడే ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌ను ఆరు అదనపు తక్బీర్‌లతో ఆచరించడం సంప్రదాయమని తెలిపారు. ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 700 మందికి పైగా భక్తులు హాజరుకావడంతో మజీద్ ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, మాజీ అధ్యక్షుడు షేక్ భాను, సభ్యులు ఖాసీంవల్లి, నాజర్ వల్లి, సత్తార్ మరియు యూత్ కమిటీ సభ్యులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎస్పీకి కేంద్ర హోం శాఖ పురస్కారం

# ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను సత్కరించిన ఎంపీ కలిశెట్టి



**విజయనగరం, ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21:** పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిష్కల్మషంగా, అంకితభావంతో సేవలు అందించిన విజయనగరం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ఏఆర్.దామోదర్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్కృష్ట సేవ పథకం'తో గౌరవించింది. ఈ నేపథ్యంలో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, దర్యాప్తు, ప్రజా భద్రత మరియు ఇంటెలిజెన్స్ వంటి కీలక విభాగాలలో దామోదర్ కనబరిచిన అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎస్పీని దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాకు, రాష్ట్రానికి ఎస్పీ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం విజయనగరం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల భద్రత కోసం శ్రమిస్తూ, విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తున్న అధికారులకు ఈ అవార్డులు మరింత స్ఫూర్తినిస్తాయని ఆకాంక్షించారు.

# సంగివలస వద్ద రోడ్డు ప్రమాదం ప్రమాదం వృద్ధురాలు దుర్మరణం



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ):** భీమిలి మండలంలోని సంగివలస గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వృద్ధురాలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పోలీసుల వివరాల ప్రకారం మార్చి 19వ తేదీ రాత్రి సంగివలస మూడు అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం--విశాఖపట్నం హైవేపై వెళ్తున్న గుర్తు తెలియని వాహనం, రహదారి దాటుతున్న వృద్ధురాలిని ఢీకొని, ఆపకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధురాలు ఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతురాలి వివరాలు ఇప్పటివరకు గుర్తించలేకపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై భీమిలి మండలానికి చెందిన వి.ఆర్.ఓ. బింగి రాము ఫిర్యాదు చేయగా, మార్చి 20వ తేదీ ఉదయం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు అధికారి ఉపనిరీక్షకుడు లలిత్ ఆదిత్య ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలను గుర్తించే ప్రయత్నాలు ముమ్మరంగా చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని త్వరలోనే గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# వీర మట్టి కోదండ రామాలయం వద్ద భక్తుల ఆందోళన

**భీమునిపట్నం,, మార్చి 21 ( మనం న్యూస్ ):** స్థానిక నెహ్రూ స్కూల్ సమీపంలో గల పురాతన వీరమట్టి కోదండ రామాలయం వద్ద భక్తులు, స్థానికులు శనివారం ఆందోళన చేపట్టారు. గత వారం రోజులుగా ఆలయంలో దూప, దీప నైవేద్యాలు స్వామి వారికి లేవని ఆగ్రహం వ్యక్తంచేసారు. శ్రీరామ నవమి ఉత్సవాలు సమీపిస్తున్న సందర్భంలో ఆలయం ఇలా ఉండటం మంచిది కాదని భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా ఇక్కడ ఉన్న పూజారిని తొలగించి ఇంతవరకు ఆలయం ఆలనాపాలనా పట్టించుకొని ధర్మ కర్తలు ఇప్పుడు ముందుకు వచ్చి ఇలా చేయడం మంచిది కాదని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మకర్తలకు తాము కూడా అండగా ఉంటామని ఆలయ అభివృద్ధికి పాటు పడతామని, కానీ ఇలా ఏక పక్ష ధోరణితో తమకి అధికారం ఉందని ఆలయ వ్యవహారాల విషయంలో తమ నిర్ణయాలకి అనుగుణంగా అందరూ ఉండాలని ఆదేశించడం సరికాదని అన్నారు. ఆలయ ధర్మ కర్తలు నిత్యం వొచ్చే భక్తులతోనూ, స్థానికుల సలహా



సంప్రదింపులతో ఆలయ నిర్వహణ చేయాలి కానీ ఏకపక్ష నిర్ణయాలతో ఆలయ నిర్వహణ చేపట్టకూడదని సూచించారు. ఆలయం ధర్మకర్తలు కట్టించినప్పటికీ ఆలయ అభివృద్ధి అనగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఇత్యాది కార్యక్రమాలు స్థానికులు భక్తుల ఆర్థిక సహాయ సహకారాలతోనే జరిగాయని ఆలయ ధర్మకర్తలు గ్రహించాలని అన్నారు. ఇప్పటికైనా సమస్య పెద్దది కాకుండా ఆలయంలో పూజారిని అందరి సమ్మతితో ఏర్పాటు చేసి ఆలయంలో దూప, దీప నైవేద్యాలు అలాగే రాములు వారి కళ్యాణం జరిగేట్టు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు లాయర్ వెంకటేష్, భరద్వాజ్, పార్వతీశం, సూర్య ప్రకాశ్, భక్తులు భాను ప్రకాష్, మధునాయుడు, ఉసిరికల తాతాజీ, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోలుగుంట మసీదులో ఘనంగా నిర్వహించిన రంజాన్ వేడుకలు

**రోలుగుంట , మార్చి 21 ( మనం న్యూస్ ):** రోలుగుంట మండలంలో ఆల్ పిరుదోష్ మసీదులో రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా మైనార్టీ మోక్ష ప్రధాన కార్యదర్శి సలీం పాల్గొని మాట్లాడుతూ రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం ఇది ఆత్మ నియంత్రణ భక్తు మరియు దానధర్మాలకు ప్రతీక నెల రోజులు పాటు పగలు ఉపవాసం రోజాలు ఉంటూ సాయంత్రం ఇఫ్తార్ కు విరమిస్తారు షెవాల్ నెలవంక దర్శనంతో ఈద్ ఉల్ ఫిత్తర్ అంటే రంజాన్ పండుగను జరుపుకుంటారు ఈ రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించింది అని ముస్లింలకి నమ్మకం ధన ధర్మాలు జకాత్ చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్ముతారు అలాగే ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ 9వ నెల ఈ నెలలో ప్రతిరోజు తెల్లవారుజామున సహరి నుండి సాయంత్రం ఇఫ్తార్ వరకు ఆహారం నీళ్లు తీసుకోకుండా ఉపవాసాలు కఠినంగా ఉంటారని ఉపవాసంతో పాటు ఐదు పూట్ల నమాజులు ఖురాన్ పాఠం చేస్తారని తెలిపారు అలాగే రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించబడిందని ముస్లింల యొక్క నమ్మకం పేదలకు దానధర్మాలు ఈద్ ప్రార్ధనలకు ముందు చేయడం తప్పనిసరిగా భావిస్తారని పేర్కొన్నారు భారతదేశంలో రంజాన్ నెలవంక దర్శనం ఆధారంగా మార్చి చివరి వారంలో ఈద్ ఉల్ ఫిత్తర్ జరుపుకుంటారని తెలిపారు అలాగే ఈ




కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ ఇమామ్ సెక్రెటరీ సత్తార్ వైస్ ప్రెసిడెంట్ మస్తాన్ హుస్సేన్ జిలాని నాగూరు సుభాను అబ్దుల్లా అబ్బు మదీనా సత్తార్ మండలంలో ఉన్న ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## చిరస్మరణీయుడు... డబ్బీరు రవికుమార్..!!



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :**నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవలతో సమాజంలో చిరస్థాయిగా నిలిచిన స్వర్గీయ డబ్బీరు రవికుమార్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఎటువంటి ఆశలు లేకుండా ప్రజల కోసం కష్టపడటం, అప్పగించిన బాధ్యతలను కర్తవ్యబద్ధంగా నిర్వర్తించడం, పారదర్శకతతో సేవ చేయడం ఆయన వ్యక్తిత్వానికి మూలాధారాలు. పత్రికారంగాన్ని వృత్తిగా ఎంచుకున్న రవికుమార్ నిజం కోసం నిబద్ధతతో పనిచేశారు. సమాజానికి ఉపయోగపడే విషయాలపై దృష్టి పెట్టి ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు. సహచర పత్రికారులకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి కృషి చేసిన నాయకత్వ గుణాలు ఆయనలో స్పష్టంగా కనిపించాయి. రాజకీయ రంగంలోనూ ఆయన సేవలు ప్రశంసనీయంగా నిలిచాయి. పదవులు, లాభనష్టాలు చూడకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గ్రామ స్థాయిలో వినాయక సంఘం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం కలిగించారు. మండల స్థాయిలో నిస్వార్థ సేవ చేస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచు కున్నారు. అవినీతి పట్ల కఠిన వైఖరి అవలంబించి, తప్పులను ఎత్తిచూపడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు.తన వర్గ అభివృద్ధికి కూడా రవికుమార్ విశేష కృషి చేశారు. ఐక్యత, పరస్పర సహకారం, సామాజిక బాధ్యతలను పెంపొందించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలనే సందేశాన్ని ఆయన తన జీవితంతోనే తెలియజేశారు.ఈ సేవలను గుర్తిస్తూ కీర్తిశేషులు అమ్మాజమ్మ సూర్య ప్రకాశరావు స్మారక సేవా ధార్మిక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "శిష్ట కరణ సేవా రత్న పుష్కారం" పురస్కారాన్ని రవికుమార్‌కు మరణానంతరం అతని సోదరుడు డబ్బీరు విజయ్ కుమార్ ప్రదానం చేయనున్నారు. ఈ గౌరవం ఆయన చేసిన సేవలకు తగిన గుర్తింపుగా నిలుస్తోంది.కీర్తిశేషులు జగన్నాధ రావు, సరస్వతి దంపతులకు జన్మించిన నలుగురు సంతానంలో రవికుమార్ రెండవ సంతానం. చిన్ననాటి నుంచే కష్టపడి ఎదిగి సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.ఆయన శరీరంగా లేనప్పటికీ, ఆయన ఆలోచనలు, విలువలు, సేవా స్ఫూర్తి ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచిపోతాయి. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## బ్రిడ్జిప్రారంబిస్తారా! ప్రయాణికులను ప్రారంబించుకోమంటరా!



**దేవరాపల్లి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** బ్రిడ్జినివెంటనే ప్రారంబిస్తారా! ప్రయాణికులను ప్రారంబించు కోమంటారా! అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు గండినాయన్ బాబు కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు శనివారం క్రిష్ణారాయుడుపేట వద్ద బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు దేవరాపల్లి నుండి వయా అనందపురం మీదుగా వైజాగ్ వెళ్ళె మద్యలో క్రీష్ణారాయుడు పెట వద్ద బ్రిడ్జి కూలిపోయి సూమారుగా ఎనిమిది నేలలు కావ స్తుందని తెలిపారు దీన్ని ప్రయాణికులు వత్తిడితో ప్రభుత్వ కోటి రూపాయలు ఖర్చుతో పనులు పూర్తి చేసి నెల రోజులు కావ స్తున్న ప్రాంబించడానికి అదికార పార్టీ పెద్దలు అందు బాటులో లేరని నెపంతో పనులు పూర్తి అయ్యి,, నెలరోజులు అయిన బ్రిడ్జిని ప్రారంబించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అగ్రహారం వ్యక్తం చేసారు దేవరాపల్లి నుండి ప్రతి పావు గంటకు ఒక బస్సు ఉండేదని తెలిపారు ప్రస్తుతం అత్యదిక బస్సులు వయా కె కోటపాడు మీదుగా విశాఖపట్నం వెళ్ళ వలసి వస్తుందని తెలిపారు ఆందోళనలు, ధర్నాలు చేస్తే గానీ అధికార యంత్రాగంలో చలనం వచ్చే అవకాశం లెదంటే ప్రజలను కూడా గట్టి అందోళన చేస్తామని స్పష్టం చేసారు ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితు మనుపు ఎన్నడు లెవన్నారు, రోజు వందలాది వాహనాలు ప్రయాణికులు తిరిగే అత్యంత కీలకమైన రోడ్డుపై చిన్న పాటి పని కూడా పూర్తి చేయలెని దుస్థితి ఎర్పడిందన్నారు కల్వర్టు కుంగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా గత డాది జూలై 21 నుంచి ఆర్టీసీ అధి కారులు విశాఖపట్నం నుంచి దేవరాపల్లి వరకు వచ్చే 12 డి, 68 డి బస్సుల రాక పోకలను నిలిపి వేశారని తెలిపారు అప్పటి నుంచి కొన్ని 12 డి బస్సులను విశాఖ నుంచి కృష్ణారాయుడు పేట వరకు మాత్రమే నడుపుతు న్నారని. అక్కడికి దేవరాపల్లి, ఆనందపురం నుంచి ఆటోల్లో చేరుకుంటూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల ప్రయాణికులు ఉద్యోగులు,వ్యాపారులు, విద్యార్థులతో ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు ప్రత్యామ్నాయంగా కె.కోటపాడు మీదుగా అరకొరగా బస్సులు నడిపినప్పటికి ప్రయాణం,సమయం ఎక్కువ అవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు అసలే అరకొరగా బస్సు సర్వీలు దీనికి తోడు మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం,అవి కూడాస మయానికి రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. సాయంత్రం ఏడు గంగలు దాటితే బస్సులు ఎప్పుడు వస్తాయెా తెలియని పరిస్థితి నెల కొందితెలిపారు. దీంతో దేవరా పల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ లో గంటలు కొంది బస్సులు కోసం పడిగా పులు కాస్తూ ఎనిమిది నెలలు గా నరకయాతన అనుభవి స్తున్నారని తెలిపారు కూటమి నాయకులు స్వార్థ ప్రయోజనాలు కోసం ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు తెలిపారు ఇప్పటికైనా వెంటనే బ్రిడ్జిని ప్రారంబించక పోతే ప్రజలను కూడా ప్రజలు చేత ప్రారంబింప చేస్తామని వారు స్పష్టంచేశారు ఈకార్యక్రమంలో ఆర్ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపాలెంలో ఘనంగా రాములోరి పెళ్లి రాట



**అచ్యుతాపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం కార్యక్రమానికి శనివారం రామన్నపాలెం లో రామాలయం వద్ద రాములోరి పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా ఘనంగా నిర్వహించారు.వేద పండితులు ముత్తయిదువులు తొలిత పందిరిరాటకు పసుపు పూసి కుంకుమ బొట్టు పెట్టి పూలతో అలంకరించి పూజలు చేశారు.అనంతరం వేదమంత్రోచరణతో రాట ముహూర్తం చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ ధర్మిరెడ్డి డ్రీమ్స్ నాయుడు ,ఎంపీటీసీ లాలం శ్రీను, మాజీ ఎంపీటీసీ సన్యాసినాయుడు (బాబు ),శ్రీరాములు, రాము, డీలర్ సుబ్రహ్మణ్యం,సత్యారావు,నానాజీ, వెంకట స్వామి నాయుడు, సన్నిబాబు, వెంకటేష్, అప్పలనాయుడు, రమ, సత్యవతి, అమ్మాజీ,తదితరులు పాల్గొన్నారు.

## బొత్సను పరామర్శించిన దగ్గుపల్లి సాయిబాబా

**పాయకరావుపేట , మార్చి 21 ( మనం న్యూస్ ) :** ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా శనివారం పరామర్శించారు. విజయనగరంలోని బొత్స నివాసానికి వెళ్లిన దగ్గుపల్లి సాయిబాబా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్సపై వివరాలు



తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## స్నేహమంటే ఇదేరా..!!

**- కష్టాన్ని గుర్తించిన పాత మిత్రులు**



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** స్నేహమంటే ఇదేరా.. సినిమా నేపథ్యాన్ని నిజ జీవితంలో నిరూపించే కథనం క్రింది విధంగా ఉంది. స్నేహం అంటే కేవలం జ్ఞాపకాలకే పరిమితం కాకుండా, ఆపదలో అండగా నిలబడటమేనని ఆనంద పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011 పదో తరగతి విద్యార్థులు మరోసారి చాటి చెప్పారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలు కష్టాల్లో ఉందని తెలుసుకున్న వారు వెంటనే స్పందించి, హృదయ పూర్వకంగా ముందుకు వచ్చి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆనంద పురం మండలం వేములవలస గ్రామానికి చెందిన బోధ ఆమని భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, కుటుంబం ఆర్థికంగా దెబ్బతింది. ఇద్దరు చిన్నపిల్లలతో జీవనభారం మోస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమాచారం ఆమె పాత స్నేహితులకు తెలిసింది. దాంతో ఒక్కసారిగా చలించిన మిత్రబృందం, "స్నేహం ఉన్నచోట సహాయం ఉండాలి" అనే భావంతో వెంటనే చర్యలు ప్రారంభించారు.విద్యార్థి దశలో కలిసిన బంధాన్ని గుర్తుచేసుకుంటూ, అందరూ తమ వంతు సహకారాన్ని సమకూర్చి, ఒక్కొక్కరూ స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి మొత్తం లక్ష రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని శనివారం ఆమనికి అందజేసి, ఆమెకు ధైర్యం చెప్పారు. కష్టసమయంలో తాము ఎప్పుడూ తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా, అందజేసిన ఈ నగదును ఆమె చిన్నారి పాప భవిష్యత్తు కోసం ఫిక్స్ డిపాజిట్‌గా ఉంచాలని సూచిస్తూ, బాధ్యతాయుతమైన ఆలోచనను వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం మిత్రబృందం లోని దూరదృష్టిని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, "స్నేహం అనేది మాటల్లో కాదు, అవసర సమయంలో చేయూతనిచ్చే చేతుల్లో కనిపించాలి. మేము చేసినది చిన్న సహాయమే అయినా, అది ఆమె కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. స్నేహబంధం ఎంత బలంగా ఉంటుందో, మనసుంటే మార్గం ఉంటుందని ఈ మిత్రబృందం నిరూపించిందని పలువురు ప్రశంసిస్తున్నారు. సమాజంలో ఇలాంటి మానవతా విలువలు పెరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# నాడు అలా..! నేడు ఇలా..!.ఎన్ హెచ్ ,516 ఈ హైవే రహదారి రాకతో చొంపి వంతెనకు మహర్దశ

**అరకులోయ , మార్చి 21 ( మనం న్యూస్ ) :** ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ నియోజకవర్గం మండల కేంద్రనికి అనుకోని కూతవేటు దూరంలో చొంపి గ్రామపంచాయితీ రహదారి గత రెండేళ్ల కాలం ముందు అస్తవ్యస్తమైన ప్రధాన రహదారి, శిథిలవ్యవస్తలో వంతెన, ప్రమాదకరంగా బురదమయమైన రహదారి,పాతబడిన శిథిలమైన వంతెనతో ఉండేది. గిరిజన గ్రామస్తులు బిక్కు బిక్కు మంటూ ఈ రహదారిలో వాహనదారులు ప్రయాణం సాగించేవారు. పెద్దవర్షం, తుపాను వరద సమయంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యేవారు.ప్రాణం అరచేతుల్లో పెట్టుకొని ఈ రహదారిలో వాహనచోదకులు ప్రయాణించేవారు. అయితే సుమారు ఒక సంవత్సరం కాలంలో రోడ్డు రహదారి అభివృద్ధి చెందాయని వాహన చోదకులు, స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కొత్తవలస కూడలి నుండి రైల్వే ట్రాక్ చొంపి గ్రామపంచాయితీ వంతెన వరకు సిసి రోడ్డు నూతన రహదారి వంతెన నిర్మాణం చేపట్టారని పలువురు





సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ విభాగం సుమారు 49 లక్షల రూపాయలతో చొంపి గ్రామపంచాయతీ కొత్తవలస రహదారి కూడలి నుండి రైల్వే ట్రాక్ వంతెన వరకు 2023 బి2024 సంవత్సరంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అలాగే ఎన్ హెచ్ 516 ఈ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా చొంపి వంతెనకు మహర్దశ కలిగిందని స్థానిక గిరిజనులు వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి నిర్మాణం కేంద్ర ప్రభుత్వం హైవే నిర్మాణంలో భాగంగా హైవే 516 ఈ రహదారి నుండి చొంపి వంతెనకు కలుపుతూ నిర్మాణానికి కోట్ల రూపాయలు వెచ్చించి నూతన వంతెన నిర్మాణం నిర్మిస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణంతో సుమారు ఐదు గిరిజన గ్రామాపంచాయతీ రహదారులకు సదుపాయం అందుబాటులోకి వస్తుందని పలువురు ఆశిస్తున్నారు. రాబోయే రోజుల్లో గిరిజన గ్రామాల రహదారులు మండల కేంద్రానికి నియోజకవర్గ కేంద్రానికి జిల్లా కేంద్రాలలో అనుసందనానికి మార్గం సుగుమవుతుందని పలువురు ఆశిస్తున్నారు.రైల్వే గెట్ ట్రాక్ పై ట్రాపిక్ అంతరాయం లేకుండా ట్రాక్ అండర్ బ్రిడ్జి కూడా ఏర్పాటు అందరికీ ఆనందం. ఇదే తరహాలో గిరిజన గ్రామాల పురాతన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని, గిరి పల్లెల రహదారులు మండల కేంద్రానికి జిల్లా కేంద్రానికి అనుసంధానం చేయాలని గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు సహకరించాలని స్థానిక గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో గిరిజన గ్రామాల ముఖచిత్రం మారుతోందని ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి దిశగా సాగుతుందని ఆశిద్దాం.

# చంద్రబాబు, పవన్, లోకేష్, అనిత చిత్ర పటాలకు పాలాభిషేకం చేసిన శ్రీ సాయి శ్యామల తాపీ మేస్త్రీ సంఘం

**పాయకరావుపేట, మార్చి 21 ( మనం న్యూస్ ) :** పాయకరావుపేట, తుని తాపీ మేస్త్రీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతగా శనివారం ఉదయం సూర్యమహల్ సెంటర్లో శ్రీ సాయి శ్యామల తాపి మేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మజ్జురి నారాయణరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చిత్రపటాలకు కార్మికులు కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ పల్లా విలియం కేరి హాజరయ్యారు. వీరితోపాటు మండల పార్టీ అధ్యక్షుడు చెంచలపు పద్దు, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలు బాబు, సీనియర్ నాయకుడు గుటూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ



గత ప్రభుత్వంలో భవన నిర్మాణ బోర్డు నిలిపివేయడంతో పాటు కరోనా ప్రభావంతో తాపీ మేస్త్రీలు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. యువగళం పాదయాత్ర సమయంలో లోకేష్కు వినతిపత్రం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక శాసన సభ్యురాలు, హోంమంత్రి అనితకు సమస్యలను తరచూ తెలియజేసిన ఫలితంగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ బోర్డు పునఃప్రారంభమైందని చెప్పారు. భవన కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆయన వివరించారు. కార్మికుని కుమార్తె ప్రసవానికి రూ.20 వేల సహాయం, పెళ్లికి రూ.40 వేల ఆర్థిక సాయం, సహజ మరణానికి రూ.60 వేలతో పాటు అంత్యక్రియలకు రూ.20 వేల మట్టి ఖర్చు అందడం కార్మిక కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు. గతంలో ఇవి నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు మార్చి 1 నుంచి మళ్లీ అమల్లోకి రావడంతో కార్మికుల్లో ఆనందం నెలకొందని తెలిపారు. పెదిరెడ్డి చిట్టిబాబు, వద్దు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ బోర్డు పునఃప్రారంభించడంతో కార్మికులు సంతోషంతో పాలాభిషేకం చేయడం ఆనందకరమని అన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికులు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలిగట్ల శ్రీనివాసరావు, ఆచంట దొర, గొల్లపల్లి నాగు, రాజన్న ఆది,భవన కార్మిక నాయకులు చంటి, శ్రీను పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి సందర్భంగా టీటీడీ కళ్యాణ మండపంలో పుష్పార్చన, శ్రీరామ సంకీర్త నార్చన

**విశాఖ పట్నం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** రానున్న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా తమ ఆధ్వర్యంలో నగరంలోని ఎంవిపి కాలని టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ సీతా సమేత శ్రీరాముల వారికి కోటి మల్లెలతో పుష్పార్చన, శ్రీరామ సంకీర్తనార్చన, హనుమాన్ చాలీసా వేద ఆశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని శారదా సంగీత నిలయం అధ్యక్షురాలు భావరాజు విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు టీటీడీ కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను గత 25 సంవత్సరాలుగా శాస్త్రీయ సంగీత పాఠశాల నిర్వహిస్తున్నా నన్నారు. తమ సంస్థ నుండి సుమారు రెండు వందల మంది సంగీత విద్యార్థులచే వసంత నవరాత్రుల సందర్భముగా శ్రీ సీతా సమేత శ్రీరాముల వారికి కోటి మల్లెలతో పుష్పార్చన, శ్రీరామ సంకీర్తనార్చన, హనుమాన్ చాలీసా వేద ఆశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయ సంకల్పించా మన్నారు. విద్యార్థులకు సనాతన ధర్మ విలువలు, భారతీయ సంస్కృతి సంప్రదాయములు



తెలియ చేయుటకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ ఆదివారం రోజున శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రతబాగ్చి, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణ బాబు హాజరవుతా రన్నారు. ఈ ధార్మిక కార్యక్రమం నిర్వహించుటకు తాము ఎవరి వద్దా ఎటువంటి రుసుము వసూలు చేయటము లేదన్నారు.

# శ్రీ రామనవమి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

- ఈ ఏడాది 100వ కళ్యాణ మహోత్సవం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



**జి.మాడుగుల, మార్చి 21 ( మనం న్యూస్ ) :** జి. మాడుగుల మండల కేంద్రంలో ఈనెల 25 నుండి 27 వరకు శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ ధర్మకర్త మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక రామాలయం వద్ద శనివారం నాడు శ్రీరామనవమి ఉత్సవ వాల్ పోస్టర్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీరామనవమి సీతారాముల కళ్యాణం 100వ కళ్యాణంగా జి.మాడుగుల లో జరుపబడుతుందని. భద్రాచలం శ్రీ రాముని కళ్యాణం జరిగే రీతిలో ఇక్కడ కూడా జరుగుతుందని ఈ కళ్యాణం లో వందమంది జంటలకు ఈ ఏడాది కళ్యాణం లో కూర్చోవచ్చునని అన్నారు. మూడు రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని అలాగే 27వ తారీఖున స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు గిరిజన సాంప్రదాయ దింసా నృత్యాలు కోలాటాలతో అంగరంగ వైభవంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస మత్స్యరాజు ప్రధాన కార్యదర్శి ఎంవిజి రాజు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎం రామరాజు, సింహాచలం రాజు, లక్ష్మీపతి రాజు, జాయింట్ సెక్రెటరీ కె.వి రమణ, చుక్కల వెంకటరమణ, వడ్డాది శ్రీనివాసరావు, ఆతవ శ్రీను, రాము, ఎం నారాయణ రాజు, కే. కొత్తందొర,కోటేశ్వరరావు, తలారి మచ్చయ్య, ఆలయ పూజారి భాస్కర్ రావు (బి ఎస్ కే టైలర్) పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన పల్లా





**గాజువాక , మార్చి 21 ( మనం న్యూస్ ) :** గాజువాకలో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగ సందర్భంగా గాజువాక ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేయడానికి ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ బిసి రోడ్ ఈద్గా మైదానంలో గాజువాక ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వమత సమైక్యతకు నిదర్శనం గాజువాక ప్రాంతమని అందరూ కలిసికట్టుగా అన్ని పండగలు చేసుకోవడం గాజువాకలో మంచి వాతావరణమని కూటమి ప్రభుత్వంలో ముస్లిం ల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మసీదు ఇమాములకు మౌజనులకు బకాయి ఉన్న జీతం ఇఫ్తార్ విందులో 45 కోట్ల రూపాయలు విడుదల చేశారని సూపర్ సిక్స్ లో భాగంగా ముస్లిం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని మసీదులకు ఈద్గాలకు దర్గాల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఉర్దూ అకాడమీ అభివృద్ధికి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కి చాలా ఎక్కువ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని చెప్పారు ఈ కార్యక్రమంలో 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ అజిమాబాద్ సున్ని జామా మసీదు ముత్తవల్లి మదిన వల్లి ఆన్సర్ వల్లి మోతి ఇషాక్ హాజీ అమీర్ జబ్బర్, మదీనా మసీదు నుండి రజివుల్లా షౌకత్ అలీ ఆరిఫ్, గౌసియా మసీదు నుండి రెహమాన్ లుక్మాన్ , ఇమ్రాన్ గౌస్ , యూత్ కమిటీలు అంజుమనే సిరతు నబి నూర్ పార్టీ అంజుమనే గౌస్ పార్టీ మదీనా పార్టీ గౌసియా నౌ జవాన్ సొసైటీ రాజా పార్టీ కాజా గరీబ్ నమాజ్ పార్టీ, ముస్లిం యూత్ వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొని ఈద్గా మైదానంలో ప్రపంచం శాంతి గురించి నమాజ్ ప్రార్ధనలు జరిపారు ఈద్గా మైదానంలో ఈద్ నమాజ్ అజీమాబా సున్ని జామా మసీదు ఇమామ్ షాకీర్ నమాజ్ చదివించారు.

# మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం..!!



**ఆనందపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత ఆశలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు విశేషంగా నిలుస్తున్నాయని టీడీపీ యువనేత గంటా రవితేజ అభిప్రాయపడ్డారు. ఉగాది పర్వదినాన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రాష్ట్ర ఐటీ మరియు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భీమిలి నియోజకవర్గానికి చెందిన తెలుగు యువత నాయకులు, ప్రతినిధులు గంటా రవితేజ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ... నిరుద్యోగుల సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టిన మంత్రి నారా లోకేష్ నిర్ణయం అభినందనీయమన్నారు. యువతకు నమ్మకం కలిగించే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ప్రభుత్వ సంకల్పబలాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ ప్రభుత్వం రాబోయే సంవత్సరాల్లో మరింత స్థిరత్వంతో పాలన కొనసాగించాలని శ్రీవారిని మొక్కుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆనందపురం విలేకరులకు తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర సురేష్ కుమార్, కోరాడ వైకుంఠం, మరిపిల్ల జ్ఞానేశ్వర్ రావు వెల్లడించారు. కార్యక్రమం విశేషాలను వివరిస్తూ, యువతకు ఇది ప్రేరణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గానికి చెందిన తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తిరుమల వేదికగా వ్యక్తమైన ఈ కృతజ్ఞతలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అంబటి అనుచిత మాటలకు నిరసనగా టిడిపి సంతకాల సేకరణ



**అనకాపల్లి చీడికాడ , మార్చి 21 ( మనం న్యూస్ ) :** రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి పై వైసిపి నేత అంబటి రాంబాబు అనుచిత వాక్యాలకు నిరసనగా టిడిపి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని మంచాల గ్రామంలో మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి చీడికాడ మండలం టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ పోతల చిన్నంనాయుడు,మాజీ ఎంపీ పి, పోతల రావణమ్మ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పి దాళినాయుడు మాజీ ఎం పీ పి కిలాపర్తి భాస్కరరావు, పెద్దాడ వెంకటరమణ కె. కోటపాడు మండల ఆధ్యక్షులు రొంగలి మహేష్, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మంచాల గ్రామ సర్పంచు ఒ గ్రామ శాఖ అధ్యక్షులు కసిరెడ్డి భాగ్యలక్ష్మి శ్రీరామూర్తి కార్యదర్శి చిరికి దేముడు నాయుడు ఆధ్వర్యంలో లక్ష సంతకాలు సేకరణ లో భాగంగా లక్ష సంతకాలు కార్యక్రమాన్ని బలపరుస్తూ మంచాల గ్రామస్తులు సంతకాలు చేసారు. ఇలాంటి అసభ్యకర పదజాలాలు ఉపయోగించిన వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తిపరుస్తూ అటువంటి వైసీపీ నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ లక్ష సంతకాల ద్వారా వైసిపి నాయకులు పై ప్రజల యొక్క ఆగ్రహాన్ని తెలియజేసే ఇదొక కార్యక్రమం, ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు కార్యకర్తలు రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని తెలియజేశారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు పై అంబటి రాంబాబు అనుకృత వాక్యాలను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ కి అవమానకరం, బాధాకరం కావున చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలంతా. ముఖ్యమంత్రి కి లక్ష సంతకాలు చేరుకోవాలని ఆశిస్తున్నారు తారువ టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు అల్లు సరోజ శ్రీనివాసరావు, ద్వారా లక్ష సంతకాలు సేకరణ చేసారు కార్యక్రమం లో మంచాల గ్రామములో టిడిపి నాయుకులు, బూత్ ఇంచార్జి కె. సురేష్, బి. జగ్గిబాబు, సిహెచ్. స్వామి, కె దొగ్గబాబు, కె. కొండల రావు, పి సన్నిబాబు, కె. శ్రీరామ్మూర్తి కె. నూకరాజు, ఎం. జగ్గిబాబు, నాయుకులు కార్యకర్తలు,లక్ష సంతకాల కార్యక్రమం లో పాల్గొన్నారు,

# గ్రామీణ వాతావరణంలో ఘనంగా రంజాన్ విందు

## - అందరినీ ఆహ్వానించి ఆత్మీయంగా పలకరించిన జమాల్ ఖాన్



**చింతూరు , మార్చి 21 ( మనం న్యూస్ ) :** చింతూరు మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ జమాల్ ఖాన్ ఒక మంచి సందేశం ఇచ్చేలా ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకి మతం, వర్గం, పార్టీ అనే తేడా లేకుండా అందరినీ ఆహ్వానించారు. గ్రామాల్లో ఉండే ప్రజలు మనస్ఫూర్తిగా కలిసిమెలిసి ఉండే భారతీయ సంస్కృతి గుర్తుకు వచ్చేలా ఈ కార్యక్రమం సాగింది. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఒకే చోట కూర్చొని భోజనం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి అన్న మాటను నిజం చేసినట్టు, జమాల్ ఖాన్ స్వయంగా విందులో పాల్గొని వచ్చిన ప్రతి ఒక్కరికీ తన చేతులతోనే భోజనం వడ్డించారు. కార్యక్రమానికి వచ్చిన వారిని ఆత్మీయంగా పలకరించి, ఆలింగనం చేసుకుంటూ రంజాన్, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు మనుషుల మధ్య అనుబంధాన్ని పెంచుతాయని, పాతకాలం లాగా అందరూ కలిసి ఉండే వాతావరణం మళ్లీ గుర్తు చేసినందుకు జమాల్ కు అభినందనలు తెలియజేశారు. చింతూరులో జరిగిన ఈ విందు కార్యక్రమం మతసామరస్యాన్ని పెంపొందించేలా “మనమంతా ఒకటే” అన్న భావనను మరోసారి గుర్తు చేసింది.



# నక్కపల్లిలో ఈ నెల 23న స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన



**మునగపాక , మార్చి 21 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న ఆర్ సి లాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు ఈనెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్మించడానికి పార్టీ సమా యత్తం కావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎలమ చిలి నియోజకవర్గంలోని మునగపాక మండలం నుండి అత్యధిక స్థాయిలో పార్టీ శ్రేణులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి తరలి రావాలని, ఎల మంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మునగపాక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు జరుగుతున్న అన్యాయంపై త్వరలోనే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి తెల్పుకోవడం జరుగుతుందని, కార్యకర్తలకు అన్యాయం జరిగితే అధికారులకు కనువిప్పు కలిగేలాగా ఆందోళన చేసిన న్యాయం చేస్తానని, కార్యకర్తలంతా మనస్పర్థలు వీడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టిడిపి పార్టీ పరిశీలకులు బోండా జగన్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులను అణగదొక్కే విధంగా వైసిపి నేతలతో చేట్టపట్టాలు చేస్తూ తెలుగుదేశం క్యాడర్ను నిర్వీర్యం చేయడానికి ప్రణాళిక రూపొందించారని, కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం త్వరలోనే ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అబ్బర్సర్ చిన్న, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ దొక్కా నాగభూషణం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, పార్టీ నేతలు పెంటకోట శ్రీరామ్ మూర్తి, మల్ల వరహానరసింగరావు, మల్ల శేషు,పలువురు పాల్గొన్నారు.

# ఫిలాడెల్ఫియా చర్చిలో విశ్వ శాంతి ప్రార్థనలు

**అచ్యుతాపురం, మార్చి 21 ( మనం న్యూస్ ) :** ప్రపంచంలో నెలకొంటున్న యుద్ధ వాతావరణం ఆగిపోవాలని, మానవాళి శాంతి మార్గంలో నడవాలని ఆకాంక్షిస్తూ అచ్యుతాపురం ఫిలాడెల్ఫియా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సౌభాగ్యంగా,అభివృద్ధి దిశగా పయనించాలనే సంకల్పంతో పాస్టర్ శ్యామ్ కుమార్,సుజాతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన ప్రముఖ వ్యక్తి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనలోని అహంకారాన్ని విడిచిపెట్టి పరస్పర గౌరవంతో జీవిస్తే సమాజంలో శాంతి స్థిరపడుతుందన్నారు. కార్యక్రమం ప్రారంభంలో భక్తులు క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ భక్తి భావంతో ప్రార్థనలు చేశారు. దేశాల మధ్య పెరుగుతున్న విభేదాలు ప్రపంచ భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్నాయని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రార్థనతో పాటు సేవా భావంతో శాంతి సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాల నాయకులు శాంతి మార్గాన్ని అనుసరించి యుద్ధాలను విరమించాలని, ప్రజలు పరస్పరం ప్రేమతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ బోధకులు చికిలే ప్రకాష్, ఏసుదాస్,జి.విజయకుమార్,డి. జయరాజ్,తిమోతి నాయుడు, ప్రేమ్ కుమార్, జాషువా రాయ్, చెక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపిన రహమతుల్లా



**విశాఖపట్నం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ రహమతుల్లా ఈద్ ముబారక్ సందర్భంగా ముస్లిం సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పండుగను ఆనందంగా జరుపుకోవాలని, అలాగే సామాజిక ఐక్యత, శాంతిని పెంపొందించడం కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ?రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు నెల రోజులు కఠిన ఉపవాసం ఉండి ఈరోజు ఈ రంజాన్ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక 22వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు పార్లమెంటరీ వైస్ ప్రెసిడెంట్ బొట్టా వెంకటరమణ వార్డు ప్రెసిడెంట్ కె. ఆనంద్, ఓమ అప్పారావు, నాగూర్ మీరా, మూలాస బుజ్జి మరియు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మండలంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ పెన్షన్దారులు సమావేశం



**రాజవొమ్మంగి , మార్చి 21 ( మనం న్యూస్ ) :** రాజవొమ్మంగి మండలంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ పెన్షనర్స్ అందరితో శనివారం మండల పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఎస్ బి బి కె వర్మ అధ్యక్షతన స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యం బకాయిల గురించి వివరించారు. పి ఆర్ సి ప్రకటించాలని, పెండింగ్ కరువుభత్య బకాయిలు మంజూరు చేయాలని, ప్రకటించిన కరువు భత్యం బకాయలు చెల్లించాలని తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బ్యాంకులో నగదు లభ్యత సమస్య గురించి కూడా చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అబ్బాయి దొర, ఉపాధ్యక్షులు సూరిబాబు, రాధాకృష్ణ, బాబూరావు మరిడిరాజులు చోడిరామారావు, పెద్ద ఎత్తున పెన్షన్ దారులు పాల్గొన్నారు.




# బీజేపీలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త ఎం.వి.ఆర్

**విశాఖపట్నం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) మంగళవారం విశాఖ బీజేపీ పార్టీ కార్యాలయం లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెంకటేశ్వర కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ తో పాటు సుమారు 100 మంది పైగా అనుచరులు, స్థానిక సర్పంచులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ విధానాలు మరియు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితులై ప్రజల సేవలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరినట్లు ఎం.వి.ఆర్ తెలిపారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అనకాపల్లి ప్రాంతంలో పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, రానున్న రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.



# మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన రంజాన్ పండగ : ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

**విజయనగరం ( మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ) మార్చి 21 :** జిల్లాలో రంజాన్ పండగ హిందూ- ముస్లిం సోదరుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, సంఘర్షలు, అల్లర్లు జరగకుండా రంజాన్ ప్రశాంతయుతంగా ముగిసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ - రంజాన్ పర్వదినాన జిల్లాలో ఎటువంటి మత ఘర్షణలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు భద్రత చర్యలు సత్ఫలితాలిచ్చాయని జిల్లా ఎస్పీ తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు డ్రోన్ లతో పర్యవేక్షించారు. మసీదుల వద్ద ప్రార్ధనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. కొన్ని మసీదుల వద్ద హిందువులు, ముస్లింలు సోదర భావంతో ఒకరినొకరు అలింగనం చేసుకొని, శుభాకాంక్షలుతెలుపుకొన్నారన్నారు. పట్టణంలో ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేసి, ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరుల వాహనాల వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారని ఎస్పీ తెలిపారు. భారత దేశం విభిన్న




సంస్కృతుల సమ్మేళనమని, రంజాన్ పండగ రోజున హిందూ-ముస్లిం సోదరులు ఒకరి సంస్కృతిని ఒకరు గౌరవించుకొంటూ, శుభాకాంక్షలు తెలుపుకొంటూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. రంజాన్ ముస్లింల పవిత్రమైన మాసమని, ప్రతీ రోజూ ఉపవాస దీక్ష చేస్తూ, ప్రార్ధనలు చేస్తూ, ముస్లిం సోదరులు తమ దాతృత్వాన్ని చాటుకుంటారన్నారు. ఈ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు తమకు ఆప్తులైన హిందువులను ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేయడం పరస్పర ఐక్యతకు, సమాజంలో శాంతి, సహనం, ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మసీదుల వద్ద సంబంధిత పోలీసు అధికారులు, సిఐలు భద్రత విధులు నిర్వహించగా, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు.

# పార్టీలో బూత్ కమిటీలది కీలకపాత్ర : మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయ ప్రసాద్

**విశాఖపట్నం , మార్చి 21 ( మనం న్యూస్ ):** పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయం లో మాజీ శాసనసభ్యులు పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ళ విజయ ప్రసాద్పార్టీ పరిశీలకులు డా జహీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరగబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డోర్ టూ డోర్ ఓటర్ లిస్ట్ వేర్ఫికేషన్ ఏ విధంగా ముందుకు వెళ్ళాలని శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ళ విజయ ప్రసాద్ మాట్లాడుతూ బి ఎల్ ఎ చేయబోయే పని చాలా కీలకం. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగింది. దాన్ని అన్వయించుకుని, మనం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. మరోవైపు అదే టెక్నాలజీ మోసం చేయడానికి కూడా వినియోగపడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, మనం చాలా



అప్రమత్తంగా పని చేయాల్సి ఉంటుంది. ఆ దిశలో మీరంతా సన్నద్ధంగా ఉండాలి. ఉన్న ఓట్లు తీసివేయకుండా, అక్రమ ఓట్లు చేర్చకుండా చాలా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. మనపార్టీ సానుభూతిపరుల ఓట్లు అక్రమంగా తొలగించకుండా చూడాలన్నారు.

**“అవసరమైతే టాస్క్‌ఫోర్స్:**

ఇప్పుడు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. మన ఓటర్లను కాపాడుకోవాలి. వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలి. అందుకు అవసరమైతే టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేసుకుందాం. బూత్ లెవెల్ పరిధిలో నాయకులను ఈ ప్రక్రియలో ప్రమేయం చేయాలి. ఆ విధంగా రాష్ట్ర స్థాయి నుంచి కింది వరకు ఒక పక్కా వ్యవస్థ.. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసుకుని, స్పెషల్ టాస్క్‌తో పని చేయాల్సిన అవసరం ఉందని, అలా అధికార పక్షం వారి ఆటలు సాగనీయకుండా లక్ష్యాన్ని సాధించుకోవాలని మళ్ళ విజయ ప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జియ్యాని శ్రీధర్, బల్ల లక్ష్మణ్ రావు, గులువిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, పిల్లా కన్న బాబువార్డ్ అధ్యక్షులు యలగాడ రాజు, భీశెట్టి గణేష్, గులివిందల కృష్ణ, పిన్నింటి అప్పలరాజు, పిలకా రామ మోహన్, చెంగల హరినాథ్, జియ్యాని మారుతి, రేవల్ల సత్యనారాయణ. వార్డ్ పార్టీ పరిశీలకులు దొడ్డి కిరణ్, పూండి మల్లేశ్వర రావు, బోగవల్లి నాగభూషణ్, యల్లపు వెంకటేశ్వర రావు, బాకీ శ్యామ్ కుమార్ రెడ్డి, మళ్ళ శ్రీను, చుక్క పైడిరాజు, రాష్ట్ర, జిల్లా, నాయకులు, వార్డ్ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.